
జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 | సంచిక :33 | మంగళవారం | 6-10-2026 | పేజీలు:8 వెల:3 | https://www.epaperjournalistdiary.com/



ధరల నియంత్రణలో సర్కార్ విఫలం

- సన్నబియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి
- నిత్యావసరాల ధరలపై ప్రభుత్వ నియంత్రణ కరవు
- నాలుగు నెలల్లో సన్నబియ్యం ధరలు 25% పెరుగుదల
- సామాన్యులపై పెరుగుతున్న ధరల భారం
- పౌరసరఫరాల శాఖ మొద్దునిద్రలో ఉందని విమర్శ
- రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి అయితే ధరలెందుకు పెరుగుతున్నాయి?
- సన్నబియ్యం పథకం సఫలమైతే ధరలెందుకు అదుపు తప్పాయి?
- రేవంత్‌రెడ్డి సర్కార్‌పై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు


హైదరాబాద్,

సన్నబియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని నియంత్రించాల్సిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ధరలను నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

-మిగతా 2 లో

ఓటు చోరీపై కాంగ్రెస్ సమరశంఖం

గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటమే



- అక్టోబర్ 10 నుంచి నవంబర్ 26 వరకు..
- దేశవ్యాప్తంగా ఆందోళనలకు నిర్ణయం
- నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ
- అక్టోబర్ 10 నుంచి బ్లాక్ స్థాయి మార్చ్‌లు
- నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో మెగా ర్యాలీ
- పాల్గొన్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, సచిన్ పైలట్, మహేష్ కుమార్ గౌడ్
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో పాటు పీసీసీ అధ్యక్షులు హాజరు

న్యూఢిల్లీ,

ఓటు చోరీ ఆరోపణలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ మరో దశ ఉద్యమానికి సిద్ధమైంది. ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా అక్టోబర్ 10 నుంచి నవంబర్ 26 వరకు రెండు నెలల పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

-మిగతా 2 లో



జ్ఞానేశ్‌తో ఎలక్షన్స్ వేస్ట్!

- సీఈసీపై సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీపే తీవ్ర ఆరోపణలు
- జ్ఞానేశ్ పదవిలో ఉన్నంతకాలం ఎన్నికలు వృథానే
- ఎన్నికల ఫలితాలు ముందే ఖరారవుతున్నాయని ఆరోపణ
- బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శ
- ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ఆరోపణలు
- కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారని అభిజీత్ దీపే వ్యాఖ్య
- సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్
- ప్రజాస్వామ్యం కోసం పోరాటం కొనసాగిస్తానని స్పష్టం

వివేకా 'హత్య', 'లిక్కర్' స్కామ్' లపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా..?.

గొడ్డలి పార్టీ అధినేత సమాధానం చెప్పాలని డిమాండ్ చంద్రబాబు

- -ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- -ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- -90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- -రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ

ప్రొద్దుటూరు, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దు పొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా



సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

-మిగతా 2 లో

రూ.4 లక్షల లంచం తీసుకుంటూ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత ఏసీబీకి చిక్కిన వైనం...

నాగారం, అక్టోబర్ 5:- (జర్నలిస్ట్ డైరీ)

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీత రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఏసీబీ ట్రాప్ చేసి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీతపై ఏసీబీ చర్యలు చేపట్టింది. ఓ పని చేసేందుకు రూ.4 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు. ఘటనపై పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



అవినీతి ఆరోపణలపై ఎల్బీనగర్ ఏసీపీ సస్పెండ్


- ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యపై సస్పెన్షన్ వేటు
- అవినీతి, అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు
- పలు కేసుల్లో జోక్యంపై ఆరోపణలు
- భూ వివాదాల సెటిల్‌మెంట్లలో జోక్యమంటూ ఆరోపణలు
- ప్రత్యేక బృందంతో వసూళ్లకు పాల్పడ్డారంటూ ఫిర్యాదులు
- బాధితుల ఫిర్యాదులపై ఉన్నతాధికారుల విచారణ
- గతంలోనూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ
- తాజాగా మరోసారి సస్పెన్షన్ ఉత్తర్వులు

జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్

అవినీతి ఆరోపణలు, పలు కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎల్బీనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కృష్ణయ్యను శనివారం పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఏసీపీ కృష్ణయ్యపై అవినీతి, అక్రమ వసూళ్లకు సంబంధించి పలువురు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమికంగా విచారణ జరిపిన అనంతరం ఆయనను సస్పెండ్ చేశారు. ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీగా కృష్ణయ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో పలు భూ వివాదాలను సెటిల్ చేయడంలో కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు వచ్చాయి. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఓ న్యాయవాదితో కలిసి సొంతంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకుని, తన కార్యాలయాన్నే అడ్డాగా చేసుకుని వేలాది సెటిల్‌మెంట్లు చేసినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. గతంలో చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లోని ఓ కేసు



విషయంలో ప్రత్యేకంగా జోక్యం చేసుకుని.. డబ్బులు ఇవ్వకుంటే స్పైపింగ్ యంత్రాలు తెప్పించి, క్రెడిట్ కార్డులు స్వైప్ చేయించి మరీ వసూళ్లకు పాల్పడ్డారని బాధితులు గతంలో ఎల్బీనగర్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యవహారానికి సంబంధించిన విషయంలో అప్పటి అడ్మిన్ ఎస్ఐతో గొడవపడిన విషయం కూడా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితులు అరెస్టు కాకుండా కాపాడడంతో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపైనా ఫిర్యాదులు అందాయి. మరోవైపు కోర్టు ధిక్కరణ కేసులో ఏసీపీ కృష్ణయ్యకు జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది.



గతంలోనూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ

గతంలో డీజీపీ కార్యాలయం నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు రావడంతో ఉన్నతాధికారులు కృష్ణయ్యను మల్కాజిగిరి కమిషనరేట్ కార్యాలయానికి పిలిచారు. అక్కడికి వెళ్లిన అనంతరం ఏసీపీ కిందపడిపోవడంతో నాగోలులోని సుప్రజా ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రికి సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకెళ్లిన అధికారులు వాటిని అందజేయగా.. నోటీసులు తీసుకోకుండా తిరిగి వెళ్లారు. అనంతరం సెలవు పెట్టి వెళ్లారు. కొంతకాలం వనస్థలిపురం ఏసీపీకి బాధ్యతలు అప్పగించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా సీపీ కార్యాలయంలో ఎస్బీ అడ్మిన్ ఏసీపీగా ఉన్న రవీందర్‌రెడ్డికి కొన్ని రోజుల పాటు ఎల్బీనగర్ ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కృష్ణయ్య తిరిగి విధుల్లో చేరారు. తాజాగా ఉన్నతాధికారులు కృష్ణయ్యను తమ కార్యాలయానికి పిలిపించి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణలపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోంది.

ఎల్ బి నగర్‌లో ఫిజియోథెరపీ సెంటర్ రీ-ఓపెన్‌కు జిల్లా వైద్యాధికారి లంచం డిమాండ్...?



నాగారం, అక్టోబర్ 5:-(జర్నలిస్ట్ డైరీ)

ఎల్ బి నగర్‌లోని ఓ ఫిజియోథెరపీ సెంటర్‌ను రీ-ఓపెన్ చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారిని ఏసీబీ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి నుంచి ఎల్ బి నగర్ వద్ద రూ.1 లక్షను వైద్యాధికారి సహాయకుడు శ్రీనివాస్ తీసుకున్నట్లు సమాచారం. డబ్బులు అందిన విషయాన్ని శ్రీనివాస్ వైద్యాధికారికి ఫోన్ చేసి చెప్పినట్లు తెలుస్తోంది. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వైద్యాధికారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని శివరాంపల్లిలోని కార్యాలయానికి తరలించారు. వైద్యాధికారి స్వర్ణకుమారితో పాటు శ్రీనివాస్, అతని ప్రైవేట్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. ఏసీబీ డిఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

రేపిస్టుల్లో భయం పుట్టించాలి

–కేవలం అరెస్టులే పరిష్కారం కాదు
–నేరాలను నియంత్రించడమే ముఖ్యం
–తప్పుచేస్తే చచ్చిపోతామని క్రిమినల్స్ భావించాలి
–అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ:
క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలని, ప్రధానంగా మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల విషయంలో మరింత కఠినంగా ఉండాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ఢిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని అభిప్రాయపడింది. అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. మనం (పోలీసులు, అధికారులు, న్యాయవ్యవస్థ) కలిసికట్టుగా పనిచేయాలి. ప్రతి మహిళ రాత్రి 11 గంటలకు రోడ్లపై ప్రయాణిస్తున్నా, మెట్రోలో వెళ్తున్నా తాను సురక్షితమని భావించేలా చూడాలి. నేరం జరగకుండా నిరోధించడమే ముఖ్యం. నేరం జరిగిన తర్వాత ఏం చేశారన్నది కాదు. మహిళలపై అత్యాచారాలు వంటి నేరాలకు పాల్పడే గూండాలు, సంఘ విద్రోహ శక్తుల మనస్సుల్లో పోలీసులు భయం సృష్టించాల్సిన అవసరం ఉంది అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని తెలిపింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని ఢిల్లీ పోలీసులకు సూచించింది. నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని కోరింది. నేరం చేస్తే చచ్చిపోతామని గూండాలు ఆలోచించేలా చేయాలి. అవసరమైనప్పుడు కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడకూడదు. మరింత కఠినంగా, నిక్కచ్చిగా ఉండటానికి అస్సలు సంకోచించవద్దు. ఆర్టికల్ 21 గురించి కొందరు గొడవ చేయవచ్చు. కానీ మహిళల భద్రత గురించి అవసరమైన చర్యలు తీసుకోండి అని ధర్మాసనం పేర్కొంది. నిరంతరం చురుకుగా గస్తీ నిర్వహించేలా చూడాలని జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది.

ఆధార్ మార్పు సింపుల్

-- మార్పులను సులభం చేసిన యూఐడీఏఐ

బిజినెస్ బ్యూరో:
ఆధార్ కార్డుదారులు తమ పేర్లలో ఉండే సవరణలు, మార్పులను సులభంగా పూర్తి చేసుకునేందుకు యూఐడీఏఐ కొత్త నిబంధనలను అందుబాటులోకి తెచ్చింది. గత నెలలో జారీ చేసిన ఈ కొత్త విధానం సెప్టెంబర్ 18 నుండి అమలులోకి తెచ్చారు. ఇనిషియల్స్ పొడిగించడం, ఇంటిపేరు మార్చడం, పేర్లలో చిన్న చిన్న స్పెల్లింగ్ తప్పులు సరిదిద్దడం, చుక్కలు తొలగించడం, క్యాపిటల్ అక్షరాల లోపాలను సరిచేయడం వంటి చిన్న మార్పులను ఉచితంగా లేదంటే సరళమైన ఐడెంటిటీ ప్రూఫ్ ఇచ్చి ఆధార్ కేంద్రాల్లో సులభంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. వివాహం లేదా విడాకుల తర్వాత మహిళలు తమ ఇంటి పేరును మార్చుకోవాలనుకుంటే, ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ డాక్యుమెంట్‌తోపాటు నిబంధనల ప్రకారం అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అయితే, పేరును పూర్తిగా మార్చడం లేదా వేరే కొత్త గుర్తింపును పొందడం వంటి పెద్ద మార్పుల కోసం అధికారిక గెజిట్ నోటిఫికేషన్, అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి. సమీపంలోని ఆధార్ సేవా కేంద్రంలో అవసరమైన పత్రాలు, బయోమెట్రిక్‌తో పాటు రూ. 75 రుసుము చెల్లించి ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

ధరల నియంత్రణలో సర్కార్ విఫలం

ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత నాలుగు నెలల్లో సన్నబియ్యం ధరలు 25 శాతం పెరిగినట్లు పేర్కొంటూ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధరలు ఇంతలా పెరుగుతున్న విషయం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని నిలదీశారు. పంట ఉత్పత్తి రికార్డు స్థాయిలో సాధించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, మార్కెట్‌లో బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. ఉత్పత్తి పెరిగినప్పుడు సాధారణంగా ధరలు తగ్గాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా సన్నబియ్యం ధరలు చుక్కలను అంటుతున్నాయని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం విజయవంతమైతే బియ్యం ధరలు ఎందుకు అదుపు తప్పుతున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యావసరాల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హరీశ్‌రావు కోరారు. పెరుగుతున్న ధరల కారణంగా సామాన్యులపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు మార్కెట్‌పై పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు కారణాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

హాస్పిటల్ కు వెళ్లిన బస్సు ఎక్కిన గృహణి ఆదృశ్యం...

జర్నలిస్టు డైరీ, ఎల్బీనగర్ :
హాస్పిటల్ కు వెళ్లిన గృహణి బస్సు ఎక్కి ఇంటికి రాకుండా కనిపించకుండా పోయిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీస్లు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలుకు చెందిన కాసీమ్ బీ(60) గృహణి, గత మూడు రోజుల క్రితం కుమారుడు మహమ్మద్ ఆక్బర్తో కలిసి వైద్య పరీక్షల కోసం మోహిదీపట్నంలోని హాస్పిటల్కు వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం కుమారుడితో పాటు తల్లి కాసీమ్ బీ నాగోలుకు వచ్చే అందుకు మోహిదీపట్నంలో 300 బస్సు ఎక్కారు. బస్సులో కాసీమ్ బీ ముందు సీటులో కూర్చోగా ఆక్బర్ వెనుకు వైపు కూర్చున్నాడు. ఎల్బీనగర్ చౌరస్తాకు వచ్చే సరికి కాసీమ్ బీ కనిపించలేదు. అతను వెంటనే బస్సులోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ అతని తల్లి కోసం వెతికినప్పటికి ప్రయోజనం లేక పోయింది. దీంతో అతని కుమారుడు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రక్షకులే రాక్షసుల్లా మారితే ఎలా?

మహిళలపై పోలీసుల దురుసు ప్రవర్తనకు ఖండన
బాధ్యులైన పోలీసులపై తక్షణ చర్యలు తీసుకోవాలి
సాకేత్ పోలీస్‌స్టేషన్ సీసీటీవీ దృశ్యాలు బయటపెట్టాలి
జర్నలిస్టుల కెమెరాలు లాక్కోవడం దారుణం
మహిళల ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు?
రక్షించాల్సిన పోలీసులే ప్రమాదంగా మారకూడదు
బాధితులకు న్యాయం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్
అమిత్‌షాను ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత



న్యూఢిల్లీ: రక్షించాల్సిన పోలీసులే మహిళలపై అరాచకాలకు పాల్పడితే ఎలా అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో మహిళలు, జర్నలిస్టులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశానికి సంబంధించి జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను 'ఎక్స్' వేదికగా ఆయన పంచుకున్నారు. పోలీసులు తమతో అనుచితంగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనకు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. జర్నలిస్టుల కెమెరాలు లాక్కోవడంతోపాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇంత జరిగినా వారు ఇచ్చిన ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మహిళలు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సమయంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. రక్షించాల్సిన వారే మహిళలకు ప్రమాదంగా మారుతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాలంటే సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. మహిళలను ప్రశ్నించే హక్కును అణచివేయడం సరికాదని రాహుల్‌గాంధీ అన్నారు. మహిళలను చూసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో మహిళలపై అణచివేత ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళా నిరసనకారులు, జర్నలిస్టుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే రాహుల్‌గాంధీ స్పందిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జ్ఞానేశ్‌తో ఎలక్షన్స్ వేస్ట్!



పుణె
చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీపే తీవ్ర ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ పదవిలో కొనసాగినంతకాలం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం వృథానేనని ఆయన వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ పుణెలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభావం బలంగా ఉన్న సమయంలోనూ బీజేపీ గెలవలేని రాష్ట్రాల్లో ఇప్పుడు ఆ పార్టీ విజయాలు సాధిస్తోందని అభిజీత్ దీపే ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు ముందుగానే ఖరారవుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితికి సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరే కారణమని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీ పదవి నుంచి తప్పుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేస్తే ఎన్నికల్లో బీజేపీకి వాస్తవంగా ఎన్ని సీట్లు వస్తాయో స్పష్టమవుతుందని అభిజీత్ దీపే అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా కోట్లాది మంది ఓట్లను తొలగించి బీజేపీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం ఉండాలంటే ఓటర్ల జాబితాలపై పారదర్శకత అవసరమని అభిజీత్ దీపే పేర్కొన్నారు. ఓట్ల తొలగింపు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటాన్ని ఆపబోనని అభిజీత్ దీపే స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అయితే, సీఈసీపై అభిజీత్ దీపే చేసిన ఆరోపణలు ఆయన వ్యక్తిగత రాజకీయ విమర్శలేనని, వాటిపై సంబంధిత ఎన్నికల అధికారులు లేదా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వివరణ రావాల్సి ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఓటు చోరీపై కాంగ్రెస్ సమరశంఖం

(మొదటి తరువాయి)

రాహుల్ గాంధీ అధ్యక్షతన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు, పీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో కీలక సమావేశం నిర్వహించామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్), ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. 'ఓట్ బచావో-దేశ్ బచావో' పేరుతో తదుపరి దశ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఓటు చోరీ అంశంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిరసనలు నిర్వహించామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. తదుపరి దశలో అక్టోబర్ 10 నుంచి 20 వరకు బ్లాక్ స్థాయిలో మార్చ్‌లు నిర్వహించి ఎస్డీఎం కార్యాలయాల వద్ద ముగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి గ్రామంలో 'విలేజ్ చౌపాల్' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఓటు చోరీకి సంబంధించి బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్ షా అనుసరిస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించడంతో పాటు గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించి ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు.
అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ప్రతి ఓటరును గుర్తించి, తిరిగి నమోదు చేయించే బాధ్యతను బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ఓట్ రక్షకులకు అప్పగించనున్నట్లు చెప్పారు. ఓట్ బచావో-దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. అనంతరం నవంబర్ 25, 26 తేదీల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో వాహన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న ఈ ర్యాలీ ఢిల్లీలో ముగుస్తుందని చెప్పారు. జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు, అరెస్టు చేసి విచారణకు గురిచేసే వరకు వీధుల్లో, రోడ్లపై తమ పోరాటం కొనసాగుతుందని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

వివేకా 'హత్య', 'లిక్కర్' స్కామ్' లపై

సమాధానం చెప్పే ధైర్యం ఉందా..?.

(మొదటి తరువాయి)

గ్రామీణ తాగునీటి కష్టాలకు 'అమరజీవి జలధార'తో చెక్
సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకు రావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.
రాయలసీమను.. రత్నాల సీమగా దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం
రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు.
రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ,
రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రు దేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే



వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.
గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి
ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు.
కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం..
'ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.
ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం
స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.
ట్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు
చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

మిట్ట కోడూర్ లో
భగ్గుమన్న బీఆర్ఎస్ వర్గపోరు

- సర్పంచ్‌ను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

జర్నలిస్ట్ డైరీ పరిగి అక్టోబర్ 5

వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూర్ గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. గ్రామంలోని మొత్తం 10 మంది వార్డు సభ్యుల్లో 9 మంది బీఆర్ఎస్, ఒకరు కాంగ్రెస్ పార్టీకి చెందినవారే అయినప్పటికీ.. పాలకవర్గం రెండు వర్గాలుగా విడిపోయింది.

మాజీ సర్పంచ్ వర్గంలో ఉప సర్పంచ్‌తో కలిపి ఆరుగురు బీఆర్ఎస్ సభ్యులు, ఏకైక కాంగ్రెస్ సభ్యుడు ఉండగా.. సర్పంచ్ వైపు ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు ఉన్నారు.గత 30 ఏళ్లుగా గ్రామసభలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దే నిర్వహించే ఆనవాయితీ ఉండగా, అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ ఏర్పాటు చేయకపోగా పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళు లర్పించలేదు అంటూ., సర్పంచ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రార్థనా మందిరంలో సభ ఏర్పాటు చేశారని మాజీ సర్పంచ్ వర్గం ఆరోపించింది. పంచాయతీ కార్యదర్శి కూడా సర్పంచ్‌కు వంతపాడారని మండిపడ్డారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ వర్గానికి చెందిన ఉప సర్పంచ్, తో కలిపి





ఆరుగురు వార్డు సభ్యులు, ఏకైక కాంగ్రెస్ వార్డు సభ్యులు, ప్రజా సంఘ నాయకులు, గ్రామ ప్రజలు, వికారాబాద్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సర్పంచ్‌ను విధుల నుంచి తొలగించాలని, కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

గ్రామస్థుల ఆగ్రహం.. బీఆర్ఎస్‌కు ఇక పుట్టగతుల్లేవా?

ఈ పరిణామాలపై గ్రామ ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీ పార్టీ వర్గపోరు, ఆధిపత్య పోరాటాలు ఏమైనా ఉంటే మీ పార్టీ ఆఫీసుల్లో తేల్చుకోవాలి తప్ప.. గ్రామంలో రెండు చోట్ల వేర్వేరుగా గ్రామసభలు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేయడం ఏంటి? అసలు మేము ఏ సభకు వెళ్లాలో తెలియక తలలు పట్టుకోవాల్సి వస్తోంది" అంటూ స్థానికులు మండిపడుతున్నారు.

పార్టీలో ఏవైనా అంతర్గత విభేదాలుంటే కూర్చొని మాట్లాడుకోవాలని, ప్రజలు ఓట్లేసి సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా గెలిపించిన తర్వాత అందరినీ కలుపుకొని గ్రామాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి ఇలా బజారున పడటం ఎంతవరకు సరికాదని, సర్పంచ్ ని, వార్డు సభ్యులను, ప్రశ్నిస్తున్నారు. "గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కి సంబందించిన, వారిని గెలిపించినందుకు ఇప్పుడు మేమే సిగ్గుపడే పరిస్థితి వచ్చింది.అని . ఈ తీరు చూస్తుంటే ఇకపై గ్రామంలో బీఆర్ఎస్ ఉనికి లేకుండా పోవడం ఖాయం" అని గ్రామస్థులు ముక్తకంఠంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. నేతల స్వార్థపూరిత కుమ్ములాటలతో మిట్ట కోడూర్ లో గులాబీ పార్టీ పట్టు పూర్తిగా చేజారిపోయే ప్రమాదంలో పడిందనే చర్చ జోరుగా సాగుతోంది.

కంటోన్మెంట్లో ఘనంగా
పోషణ మాసం కార్యక్రమం



గర్భిణీ స్త్రీలకు సన్మానం చేస్తున్న దృశ్యం

కంటోన్మెంట్, జర్నలిస్ట్ డైరీ:

పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని బోయినపల్లి సెక్టార్ పెద్దతోకట అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ డా. స్వప్న, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మి, ఝాన్సీ , వనిత ఆర్య జనని నుండి ప్రవళిక, పద్మ--ఆశ్రిత NGO ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎస్పీ గ్రీవెన్స్ కార్యక్రమంకు 100 ఫిర్యాదులు

ఒంగోలు, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :



ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)యన్.యుగంధర్ బాబు మరియు పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులతో పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్రంగా విచారణ జరిపి, నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని అడిషినల్ ఎస్పీ ఆదేశించారు. వివిధ సమస్యలతో పోలీసు కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీసు శాఖ భరోసాగా నిలవాలని, ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఫిర్యాదుల పరిష్కారం కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధతో స్పందించి, వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, కొండేపి ఎస్సై త్యాగరాజు, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 641 రద్దు చేయాలి..

-ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం ఆగదు

-రెండో రోజుకు చేరిన సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక రిలే దీక్ష

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

సిద్దాపూర్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. డంపింగ్ యార్డ్ కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను వెంటనే రద్దు చేయాలని దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కో కన్వీనర్ బిచ్యా నాయక్‌తో పాటు రాజేందర్ రెడ్డి, మల్లేష్, రమేష్, ప్రమోద్, గుని మహేష్, రెడ్యా నాయక్, నరేందర్ రెడ్డి, నగేష్ నాయక్, సురేష్, కుమార్, బాబురాజ్ నాయక్, వీరేష్ నాయక్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దాపూర్ సమస్య కేవలం ఒక గ్రామానికి సంబంధించినది కాదని, వేలాది మంది



ప్రజల భవిష్యత్తు, రైతుల జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా సిద్దాపూర్ ప్రజలు ఒక్కతాటిపై నిలబడి ఈ పోరాటం చేస్తున్నారని, ఇది రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ప్రజల భవిష్యత్తు, ప్రాంత పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. జీవో 641ను రద్దు చేసి సిద్దాపూర్‌ను డంపింగ్ యార్డ్ ప్రతిపాదన నుంచి తప్పించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

నవోదయ విద్యాలయంలో మోడల్ యూత్ గ్రామసభ నిర్వహణ...



ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :



ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం మోడల్ యూత్ గ్రామసభ కార్యక్రమం జరిగింది. మోడల్ యూత్ గ్రామసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులు 19వ వార్డు మాజీ కార్పొరేటర్ ఈదర చిన్నారి, విద్యాలయా ప్రిన్సిపల్ సి.శివరాం, సీనియర్ టీచర్ యన్.తాతయ్య జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం ముఖ్య అతిథి ఈదర చిన్నారి మాట్లాడుతూ... నవోదయ విద్యాలయంలో మోడల్ యూత్ గ్రామ సభను ఘనంగా నిర్వహించడం పట్ల ఆయన విద్యార్థులను,ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగే పలు కార్యక్రమాలను విద్యార్థులు గ్రామ సభ విధి విధానాలను సభలో ఉండే ప్రతి ఒక్కరి పాత్రను వారు నిర్వహించే విధి విధానాలను తిలకించి అభినందించారు. గ్రామ సభల వల్ల విద్యార్థులు గ్రామాల్లో జరిగే పలు కార్యక్రమాలను తెలుసుకోవచ్చన్నారు. గ్రామ సభ అనేది పంచాయతీ పరిధి లోని ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న గ్రామస్థులందరితో కూడిన ప్రత్యక్ష ప్రజాస్వామ్య వేదిక అని చెప్పవచ్చని తెలిపారు.విద్యాలయ ప్రిన్సిపల్ సి.శివరాం మాట్లాడుతూ పీఎం అక్టివిటీలో భాగంగా విద్యాలయం నందు మోడల్ యూత్ గ్రామసభని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జయదీప్ సర్పంచ్ పాత్ర పోషించారు. సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి, గ్రామానికి కావలసిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను చర్చించారు.బడ్జెట్ పరిశీలన, జవాబుదారీతనంతో పాటు పలు విషయాలను విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో ఎన్.తాతయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఈరోజు లబ్ధిదారులకు మండలం కేంద్రం లో ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు.జిల్లెడ్ చౌదరి గూడ మండలం లోని పలు గ్రామాల వారికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు వివరాలు..

1)గొల్ల రాజు చౌదరి గూడ కి 60000రూపాయలు
2)పర్వతాపురం పారిజాతం చౌదరి గూడ కి 14500రూపాయలు
3)మంగలి ఆంజనేయులు చౌదరి గూడ కి 20000రూపాయలు
4)కుర్వ నర్సింలు ఎల్కగూడ కి 26500రూపాయలు
5)రైసా బేగం ఎల్కగూడ కి 14500రూపాయలు
6)గిరి మొని మంగమ్మ పెద్ద ఎల్కిచర్ల కి 32000రూపాయలు
7)జోగు రమేష్ ఏదిరా కి 41000రూపాయలు
8)వడ్ల భ్రమయ్య చేగిరెడ్డి ఘనపూర్ కి 51000 రూపాయలు
9)పిట్ట తిరుమలమ్మ తుమ్మలపల్లి కి 10000 రూపాయలు
10)ఎ. పురుషోత్తం తుమ్మలపల్లి కి 31500



రూపాయలు
11)మంగలి శివకుమార్ వీరన్నపేట్ కి 27000 రూపాయలు

అందజేశారు.చెక్కులు తీసికున్నవారు ఏమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు....ఈ కార్యక్రమంలో జిల్లెడ్ చౌదరి గూడ మండల మాజీ సర్పంచ్ల సంఘశీ అధ్యక్షులు మీదిగడ్డ బాబురావు గారు జిల్లెడ్ చౌదరి గూడ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు నర్సింగ్ రావు గారు, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ,, మహాదేవపూర్ సర్పంచ్ అనుష రవీందర్ రెడ్డి, మల్కాపహాడ్ గ్రామ సర్పంచ్ రవీందర్ నాయక్, పెద్ద ఎల్కి చర్ల గ్రామ సర్పంచ్ సోని శేఖర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎండీ జబ్బార్, రమేష్ నాయక్, మాజీ ఎంపీటీసీ లు శ్రీనివాస్ రెడ్డి,రమేష్, చింత కుంట గ్రామ మాజీ మాజీ సర్పంచ్ హరి నాయక్,జాకారం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం, గోపాల్ నాయక్,పెద్ద ఎల్కి చర్ల గ్రామ ఉప సర్పంచ్ గుడిసె బాలరాజ్,తుమ్మలపల్లి గ్రామ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, ఎల్కగూడ గ్రామ ఉప సర్పంచ్ అనంతమ్మ,ఇంద్రనగర్ గ్రామ ఉప సర్పంచ్ మంగలి శేఖర్,జనార్దన్ గౌడ్,నవీన్ పటేల్, తుమ్మలపల్లి శేఖర్,ప్రకాష్, మన్నే నాయక్, ఎ రాంరెడ్డి, వై, రాంరెడ్డి,ఎ. ప్రవీణ్,శేఖర్,నర్సింలు, కుమ్మరి శేఖర్, లక్ష్మీదేవిపల్లి,హరిశ్వర్ రెడ్డి,తూంపల్లి సురేష్, దశరథ్, భూపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి,జగదీష్,మల్లా రెడ్డి, ప్రవీణ్,కుర్వ యాదయ్య, ఎ, శ్రీవాస్ రెడ్డి భూపాల్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి,కార్తీక్,లతీఫ్, కోరే శ్రీనివాస్, తులసి రాం, మనోహర్, వెంకట్ రెడ్డి, యాదయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు

-5 నెలల 19 రోజుల హుండీ ఆదాయం రూ.15,13,625/-



మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.
కార్యనిర్వహణ అధికారి గొలమారి శ్రీనివాసులు రెడ్డి, దేవాలయ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె. చైతన్య పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.ఈ సందర్భంగా గత 5 నెలల 19 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ.15,13,625/- ల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో 4 నెలల 15 రోజుల కాలానికి హుండీ ద్వారా రూ.12,45,666/-ల ఆదాయం వచ్చింది.ఇది గత హుండీ లెక్కింపుతో పోలిస్తే ప్రస్తుతం రూ.2,67,959/- మేర పెరిగింది.
హుండీ లెక్కింపు కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సేవా సంఘం మహిళలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. భక్తుల సహకారం, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్యతో హుండీ ఆదాయం పెరుగుతోందని ఈవో గొలమారి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

కీసరగుట్టలో గవర్నర్ సతీమణి జానకి శుక్ల ప్రత్యేక పూజలు...

- ప్రొటోకాల్ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, దేవాలయ అధికారులు...



నాగారం, అక్టోబర్ 05(జర్నలిస్ట్ డైరీ):-
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సతీమణి జానకి శుక్ల సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు దేవస్థాన చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డిలు ప్రొటోకాల్ స్వాగతం పలికారు.
అభిషేకం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. దేవస్థానం తరపున స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, పట్టు వస్త్రాలతో జానకి శుక్లను సత్కరించారు. ఆమె పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో పోలీసులు ప్రత్యేక భద్రత, ప్రొటోకాల్ ఏర్పాట్లు చేశారు.కార్యక్రమంలో ఆర్డీఓ నల్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఏసీపీ చక్రపాణి, సీఐ రమేష్, మున్సిపల్ ఉప కమిషనర్ రామలింగం, దేవస్థాన సిబ్బంది, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి 'కారుమూరి'ని హైదరాబాద్ జైలు నుంచి 'విజయవాడ తరలింపు'

-మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరిని 'సిట్' కస్టడీకి

-కుమారుడికి సబ్ కాంట్రాక్టు ఇప్పించి నిధులు స్వాహా చేశారని ఆరోపణలు

-కుమారుడు, కోడలి ఖాతాల్లోకి 85 శాతం నిధులు మళ్లినట్లు -గతంలో ఈడీ గుర్తింపు

-ఈ నెల 9 వరకు కారుమూరిని ప్రశ్నించనున్న సిట్ అధికారులు



విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు.విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు.ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది.

85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి జమ


ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు

'ఏపీసీపీడీసీఎల్' పరిధిలో ఈనెల 6, 7, 8 తేదీల్లో "సేవా సేతు అభియాన్" క్యాంపులు

-ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి

-రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన

-రూ.78 వేల వరకు సబ్సిడీ



విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల డిస్కమ్‌ల పరిధిలో "సేవా సేతు అభియాన్" క్యాంపు లను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నారు.
కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో "సేవా సేతు అభియాన్" క్యాంపులను నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రతి ఇంటికి సౌర విద్యుత్‌ను చేరువ చేయడం, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవా సేతు అభియాన్ ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని అన్నారు.

రూ.78 వేల వరకు సబ్సిడీ

ఈ పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు:
1 కిలోవాట్‌కు రూ.30,000
2 కిలోవాట్లకు రూ.60,000
3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000/- ల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని సీఎండీ తెలిపారు.

క్యాంపుల్లో పూర్తి సమాచారం

"సేవా సేతు అభియాన్" క్యాంపుల ద్వారా ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ పొందే ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొని వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పథకం అమలుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించనున్నట్లు
ప్రతి ఇంటినీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమే లక్ష్యం
అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తన ఇంటినే విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చుకోవాలని సీఎండీ పి. పుల్లారెడ్డి పిలుపునిచ్చారు.
రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.ఏపీసీపీడీసీఎల్ పరిధి లోని సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో సేవా సేతు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో సేవా సేతు క్యాంపులను సందర్శించి రూఫ్‌టాప్ సోలార్‌పై పూర్తి సమాచారాన్ని తెలుసుకుని పథకం ప్రయోజనాలను పొందాలని సీఎండీ కోరారు.
పీఎం సూర్య ఘర్ పథకం లేదా సేవా సేతు క్యాంపులకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ఏపీసీపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించి సమాచారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

నాడు ఉపాధిని కల్పిస్తే.. నేడు ఉపాధిని మర్చిపోయారు

-కేసీఆర్ పాలనలో పోలీస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలో ఎన్నో ఉద్యోగాలు భర్తీ చేశారు

-నేటి రేవంత్ రెడ్డి పాలనలో ఉపాధి ఊసే లేదు

-నిరుద్యోగులను పట్టించుకునే దిక్కులేదు

-కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది

-యువత ఆలోచించాలి, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును గ్రహించాలి

-పట్టుదలతో పార్టీ శ్రేణులు పనిచేసి బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని పెద్ద మెజార్టీతో గెలిపించాలి

-ఓటర్ నమోదు పై అన్ని వర్గాల పార్టీ శ్రేణులు దృష్టి సారించాలి

-షాద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :
కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల ఓటర్ నమోదుపై నిర్వహించిన పార్టీ శ్రేణుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖలో వేల ఉద్యోగాలను భర్తీ చేశారని, రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని, నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేస్తామని నిరుద్యోగుల సాక్షిగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకిచ్చిన మాట తప్పిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యనుఅందించడంతోపాటు కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కేసీఆర్ కు దక్కితే, ఉన్న ప్రభుత్వ విద్యను నీరుగారిచే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవర్తిస్తుందని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును యువత గ్రహించాలని, పాలన తీరును ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని, నేటి నుంచే గెలుపు కోసం కృషి చేసేందుకు ఐక్యమత్యంగా నిలబడాలని కోరారు. పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుని కలిసి నమోదు చేయించాలని కోరారు. ఆన్లైన్, ఆఫ్లైన్లలో నమోదు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి పూర్తి స్థాయి అవగాహన పెంచుకొని , ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, మహిళా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మితో పాటు మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే...మంత్రి రాంప్రసాద్ రెడ్డి

-కడప టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు

-రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు

మంగళగిరి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు.

సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారు


ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందుల లోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

డ్రగ్స్ రహిత సమాజం కోసం మరో ముందడుగు

-డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా డా. సామ రవీందర్ రెడ్డి రచించిన 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకావిష్కరణ

-మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం - డీజీపీ సీవీ ఆనంద్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ డైరీ)
మాదకద్రవ్యాల దుర్వినియోగం, దాని దుష్పరిణామాలు, నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డా. సామ రవీందర్ రెడ్డి రచించిన 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. పోలీసుశాఖ, ఈగల్ ఫోర్స్ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు.
మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితానికే పరిమితం కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని డీజీపీ అన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడం కంటే, ముందుగానే అవగాహన కల్పించడం మరింత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, యువత సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువత, విద్యార్థులతో పాటు మహిళలు, చిన్నారులకు కూడా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ ఏ రూపంలో ఉన్నా వాటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డా. సామ రవీందర్ రెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సమస్యలపై స్పందిస్తూ విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.డా. సామ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకావిష్కరణతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకం తెలంగాణలోని విద్యాసంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన పుస్తకంగా రూపొందించామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ క్యాంపస్‌లలో మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఇందులో సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. విద్యార్థులు, యువత తప్పనిసరిగా చదవాల్సిన విధంగా పుస్తకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.
"మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా ఉండాలంటే ముందుగా అవగాహన అవసరం. మత్తుకు అలవాటు పడిన తర్వాత నిర్మూలన చర్యల కంటే ముందుగానే నివారణకు కృషి చేయడం ఎంతో ముఖ్యం" అని డా. రవీందర్ రెడ్డి అన్నారు.
"మన చదువు మన కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఉపయోగపడాలి" అనే ఆలోచనతో ఒకవైపు విద్యార్థుల విద్యా అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలను, మరోవైపు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే పుస్తకాలను రచిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పోలీసుశాఖ అవకాశం కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.ఈ పుస్తకానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఐఏఎస్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య ముందుమాటలు రాసినందుకు డా. రవీందర్ రెడ్డి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డా. కె. సురేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, పోలీసుశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని డా. సామ రవీందర్ రెడ్డిని అభినందించారు.

రాంపల్లి డంపింగ్‌యార్డులో వ్యర్థాల తొలగింపు ప్రారంభం....





నాగారం, అక్టోబర్ 05(జర్నలిస్ట్ డైరీ):
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్‌లోని రాంపల్లి డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన పారిశుధ్య వ్యర్థాల తొలగింపు పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. డంపింగ్‌యార్డులో వ్యర్థాల సమస్యపై స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించారు.
ఘట్‌కేసర్ సర్కిల్--6 డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి ఆదేశాల మేరకు రామ్‌కీ సంస్థ ఆధ్వర్యంలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. పనులు పూర్తయ్యే వరకు అధికారులు రామ్‌కీ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పురోగతిని పర్యవేక్షించనున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఎస్సీటీపీకి స్థలం గుర్తింపు రాంపల్లి డంపింగ్‌యార్డు వద్ద రోజువారీగా సేకరించే ఘన వ్యర్థాలను అదే రోజు శాస్త్రీయ పద్ధతిలో స్వీకరించి, మూసివేసిన వాహనాల ద్వారా సంబంధిత వ్యర్థాల శుద్ధి కేంద్రాలకు తరలించేందుకు ద్వితీయ వ్యర్థాల సేకరణ బదిలీ కేంద్రం (ఎస్సీటీపీ) ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. డంపింగ్‌యార్డుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాటి కేసీఆర్ సంకల్పమే.. నేటి కల్యాణ లక్ష్మి

-పేద యువతులకు అండగా నిలిచిన మేనమామ, పెద్దన్న కేసీఆర్

-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

-కల్యాణ లక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు గడిచిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ డైరీ) :
తెలంగాణ రాష్ట్ర సాధకులు, మాజీ సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతోనే కళ్యాణ లక్ష్మి పథకం పురుడు పోసుకుందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు గడిచిన శుభ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. గతంలో ఎంతోమంది తమ పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని, ఒకానొక సమయంలో ఆడపిల్లలను కనాలంటేనే భయపడే పరిస్థితికి వచ్చిందని, నాటి పరిస్థితులను గమనించిన కేసీఆర్ పేద ప్రజలకు అండగా నిలవాలనే ఉద్దేశం తో కళ్యాణ లక్ష్మి పథకాన్ని రూపొందించారని గుర్తు చేశారు. గిరిజన కుటుంబంలో జరిగిన ఇబ్బందులను గుర్తించి నాడు 50 వేల ఆర్థిక సాయంతో ప్రారంభించిన పథకం రూ. లక్ష వరకు చెల్లించి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే రూ. మూడు లక్షల నగదును కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద యువతలకు అందిస్తామని కేసీఆర్ ప్రకటిస్తే, మోసపూరిత మాటలతో కాంగ్రెస్ లక్ష రూపాయల నగదు తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పథకాన్ని పూర్తిగా మర్చిపోయారని ఆరోపించారు. మహిళల సంక్షేమం కోసం కెసిఆర్ చిత్తశుద్ధితో పనిచేస్తే, నేటి ముఖ్యమంత్రి మహిళల అభివృద్ధిపై కనీస ధ్యాస లేదని ఆరోపించాను. కళ్యాణ లక్ష్మి ప్రారంభమై 12 ఏళ్లు గడవడం శుభసందర్భమని కేసీఆర్ చేసిన పనితీరును మరోమారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్డినేటర్ రాజ్యలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య, మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, ఫరూఖ్ నగర్ మండల మహిళ అధ్యక్షులు సుష్మా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక, కౌన్సిలర్లు పిల్లి శారద, జి.టి వసంత, ఒగ్గు జయలక్ష్మి, నడికూడ అనిత, చల్లా వాణి, మాజీ కౌన్సిలర్లు ప్రేమలత, జూపల్లి కౌసల్య, సర్పంచ్ నాళ్ళపురం రాధిక, మహిళా నాయకులు విజయలక్ష్మి, కృష్ణవేణి, పద్మమ్మ తదితరులు, మహిళలు పాల్గొన్నారు.

అంబటి రాంబాబు'కు కిర్లంపూడి పోలీసుల 'నోటీసులు'

-ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ

-ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి

-వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం



విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.
కేసు నేపథ్యంలో వెళ్తే...
ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు

కోడంగల్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

-వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పంటలు ఎండిపోతున్నాయి

-పెట్టుబడులు నష్టపోయి అప్పుల భారంలో రైతులు

-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ డిమాండ్



జర్నలిస్ట్ డైరీ కొడంగల్ అక్టోబర్ 05:-
కోడంగల్ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోడంగల్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.
సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. వర్షాధారంగా సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కులు, కూలీల ఖర్చుల కోసం రైతులు పెట్టుబడులు పెట్టినా పంట చేతికి రాకపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
సాగునీటి సమస్య రైతులకు ప్రధాన సమస్యగా మారిందని అన్నారు. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడం, బోర్లలో నీటిమట్టాలు తగ్గిపోవడంతో పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారిందన్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు అదనపు ఖర్చులు చేయాల్సి వస్తోందని తెలిపారు.పంటలు దెబ్బతినడంతో రైతుల ఆదాయం తగ్గిపోతుండగా, మరోవైపు వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ ఖర్చులు, గతంలో చేసిన అప్పుల భారం పెరుగుతోందని అన్నారు. పశువుల పెంపకంపై ఆధారపడుతున్న రైతులకు కూడా నీరు, పశుగ్రాసం కొరత ఏర్పడే పరిస్థితి ఉందని తెలిపారు.
కోడంగల్ ప్రాంతంలో గ్రామాల వారీగా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలపై ఉపశమన చర్యలు తీసుకోవడంతో పాటు, పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని కోరారు.
అలాగే చెరువులు, కుంటలు, కాలువలకు మరమ్మతులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. కోడంగల్ ప్రాంతానికి ప్రత్యేక కరువు సహాయక చర్యల ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించి, తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రాంపల్లిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ...



నాగారం, అక్టోబర్ 5(జర్నలిస్ట్ డైరీ):
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ రాంపల్లిలో సోమవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు, ఇతర ప్రయోజనాలు అందనున్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను
విజయవంతం చేయాలి

-కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు మంత్రి డా.స్వామి పిలుపు

-ఈ నెల 9 న సీఎం చంద్రబాబు కొండపి నియోజకవర్గ పర్యటన





టంగుటూరు, ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఈ నెల 9 వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండపి నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో సోమవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెం ఐఓసి వద్ద దామచర్ల సత్య కార్యాలయంలో కొండపి నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు కనిగిరి ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండపి నియోజకవర్గం నర్సింగోలులో పర్యటించి 8,000 మందికి పైగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం నర్సింగోలులో ముఖ్యమంత్రి పర్యటన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పర్యటనకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు, కూటమి కార్యకర్తలు పాల్గొనేలా చూడాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ బూత్ ఇంచార్జ్ లు అందరూ సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సమావేశంలో కొండపి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు

మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై 'అత్యాచార' యత్నానికి పాల్పడ్డ నిందితుడికి '10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష'

-రూ.5,000/- జరిమానా

-బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం అందేలా చర్యలకు ఆదేశాలు

-తీర్పు వెలువరించిన ఒంగోలు రెండవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పందిరి లలిత

బాపట్ల, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
2023 సంవత్సరంలో బాపట్ల జిల్లా చీరాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడైన ఈపురుపాలెం గ్రామం భావనారుషి పేటకు చెందిన గుత్తి శీను(24)కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000/-లు నగదు జరిమానా విధిస్తూ సోమవారం ఒంగోలు 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పందిరి లలిత తీర్పు వెలువరించారు. అదేవిధంగా, బాధితురాలికి రూ.5,00,000/- నష్టపరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా న్యాయ స్థానాల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకునేందుకు ప్రతి కోర్టుకు ఒక డెడికేటెడ్ కానిస్టేబుల్‌ను నియమించి, జిల్లా కేంద్రంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్టు లైజనింగ్ సెల్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రయల్స్‌ను పర్యవేక్షిస్తూ, నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మహిళా భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళా సంబంధిత కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఆపరేషన్ దండాయన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని న్నారు.

కేసు ఘటనా వివరాలోకి వెళ్తే...
ది. 22.10.2023 న ఫిర్యాదుదారు కూలి పనుల నిమిత్తం బిర్యానీ షాపుకు వెళ్లారు. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో, శారీరక వైకల్యంతో బాధపడుతున్న తన కుమార్తెను ఆమె కుమారుడు ఇంట్లో ఉండి చూసుకుంటున్నాడు.సాయంత్రం



సుమారు 06.00 గంటల సమయంలో ఫిర్యాదుదారు కుమారుడు ఏడుస్తూ పరుగెత్తుకుంటూ వచ్చి, ఒక వ్యక్తి ఇంట్లోకి వచ్చి తన అక్కతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదుదారుకు తెలపగా, ఫిర్యాదుదారు వెంటనే ఇంటికి వెళ్లి చూడగా, నిందితుడు గుత్తి శీను బాధితురాలిపై అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించి గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం ఫిర్యాదుదారు పోలీసులను ఆశ్రయించి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు

కేసు నమోదు మరియు దర్యాప్తు
ఫిర్యాదుదారు ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి చీరాల II టౌన్ ఎస్.ఐ. చంద్రావతి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సంబంధిత సాక్షులను విచారించి, బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, ఇతర భౌతిక సాక్ష్యాధారాలను సేకరించారు. నిందితుడిపై మోపబడిన నేరాన్ని నిరూపించేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను సమగ్రంగా సేకరించి, నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. దర్యాప్తు అనంతరం సంబంధిత న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.

కోర్టు విచారణ, ట్రయల్ పర్యవేక్షణ :
ఒంగోలు రెండవవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కేసు విచారణ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మొయిన్ పర్యవేక్షణలో, చీరాల టూ టౌన్ సీఐ శశి కుమార్ కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ బాల నాగిరెడ్డి, డెడికేటెడ్ కోర్టు కానిస్టేబుళ్లు షేక్ కరీముల్లా, షేక్ మూసా సాక్షులకు తగిన రీతిలో ధైర్యం కల్పించి, వారు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా అవసరమైన సహకారం అందించి, సాక్షులను సరైన సమయంలో న్యాయస్థానంలో హాజరుపరిచారు.కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి అవనీష్ ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతమైన వాదనలు వినిపించి, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర భౌతిక సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్థవంతంగా ప్రవేశపెట్టారు.ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ఒంగోలు 2 వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పందిరి లలిత, నిందితుడు గుత్తి శీను నేరానికి పాల్పడినట్లు నిర్ధారించారు. నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5,000/- నగదు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.అదేవిధంగా, బాధితురాలికి రూ.5,00,000/- నష్టపరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడికి విధించిన తీర్పే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆపరేషన్ దండాయన్‌లో భాగంగా మహిళా సంబంధిత కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది, ట్రయల్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన కోర్టు లైజనింగ్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని, అలాగే ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతమైన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి అవనీష్ చేసిన కృషిని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, అభినందించారు.

ఈ-సంజీవని సేవలను సమర్థవంతంగా అమలు చేయాలి

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :



జిల్లాలో ఈ-సంజీవని టెలీ మెడిసిన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటు లోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు కలెక్టర్ ఛాంబర్‌లో ఈ-సంజీవని అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో 62 ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో, పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ - సంజీవని సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పేషెంట్ కేర్ కో - ఆర్డినేటర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ద్వారా సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని అన్నారు. సాధారణ వైద్యం, మాతా - శిశు సంరక్షణ, చిన్నారుల వైద్యం, అంటు వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్, మానసిక ఆరోగ్య సమస్యలకు టెలీ కన్సల్టేషన్, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలు అందనున్నట్లు వివరించారు.జిల్లా ఆసుపత్రి కో - ఆర్డినేటర్ డాక్టర్ కె.వి. లక్ష్మీకుమారి మాట్లాడుతూ... 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, కందుకూరు ఏరియా ఆసుపత్రిని ఈ-సంజీవని సేవలకు గుర్తించినట్లు తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. రిమ్స్‌లో ప్రత్యేక ఈ-సంజీవని కౌంటర్ ఏర్పాటు చేసి, పీహెచ్‌సీలకు స్పెషలిస్ట్ వైద్య సేవలను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. సమీక్షలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బి. శ్రావణ్ కుమార్, డాక్టర్ నబి, డాక్టర్ నిరంజన్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ అధికారి సుబ్బలక్ష్మి, జిల్లా మాస్ మీడియా అధికారి బి. నరసింహారావు, డిప్యూటీ అధికారి కె.ఏ. రాజు, ప్రోగ్రామ్ అధికారులు ప్రభాకర్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో
ఇంద్రకీలాద్రిపై ప్రధాని 'మోదీ పేరిట పూజలు

-25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న మోడి

-పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ

-అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ

-ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష

విజయవాడ, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత



పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా మోడి తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలు రాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం

అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన
ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు

గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి

-మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 215 అర్జీలు

మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు.
సోమవారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.భూసమస్యలు, రెవెన్యూ అంశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇళ్ల





స్థలాలు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆమె అన్నారు.ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి, నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీదారులకు తీసుకున్న చర్యలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.కార్యక్రమంలో మొత్తం 215 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 151 అర్జీలు, ఇతర శాఖలు, వివిధ సమస్యలకు సంబంధించి 64 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి,అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్ రావు, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, డ్వామా పీడీ సువార్త, లీడ్ బ్యాంకు మేనేజర్ షాహీర్, డిఇఓ సుబ్బారావు, డిఎల్డిఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు నూతన సీఐగా ఎస్. జగదీష్

కందుకూరు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :



కందుకూరు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. జగదీష్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సీఐ జగదీష్ మాట్లాడుతూ కందుకూరు పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువగా ఉండేలా చర్యలు చేపడతామని, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా విధులు నిర్వహిస్తామని సీఐ జగదీష్ తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై
మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!

-ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం

-2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం

-ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

-ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

ఉండవల్లి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఏడాదిలోగా వన్-స్టార్ పాఠశాలలన్ని...టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్
ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరోస్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు.



ప్రభుత్వ స్కూళ్లను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి
2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 “లీప్ స్కూళ్లను” అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.

7 వేల హైస్కూళ్లలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తి స్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను “నైపుణ్యం పోర్టల్” పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు

శివలింగం చుట్టూ మూడు నాగుపాముల ప్రదక్షిణ.. నెల్లూరు జిల్లాలో అద్భుత సన్నివేశం..

-నెల్లూరు జిల్లా మనుబోలులోని కాశీ విశ్వనాథ ఆలయంలో ఘటన
-ప్రదక్షిణ తర్వాత ఆలయంలోని పుట్టలోకి వెళ్లిన నాగుపాములు
-గతంలోనూ ఇదే ఆలయంలో పలుమార్లు కనిపించిన నాగసర్పాలు

నెల్లూరు,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
నెల్లూరు జిల్లాలో ఓ శివాలయంలో నిన్న అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. వివరాల్లోకి వెళ్తే.. మనుబోలు బీసీ కాలనీ సమీపం లోని శ్రీకాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ఉదయం మూడు నాగు పాములు శివలింగం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కనిపించాయి. శివలింగాన్ని చుట్టుకొని, కొద్దిసేపు అక్కడే పడగవిప్పి ఉన్న సర్పాలను చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. అనంతరం ఆ మూడు పాములు ఆలయంలోనే ఉన్న పుట్టలోకి వెళ్లిపోయాయి.ఈ అరుదైన దృశ్యాన్ని కొందరు భక్తులు తమ ఫోన్లలో వీడియో తీయడంతో అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజే ఇలా మూడు నాగసర్పాలు కనిపించడం దైవ సంకేతంగా భక్తులు భావిస్తున్నారు.



ఇదే మొదటిసారి కాదు.
ఈ ఆలయంలో నాగుపాములు కనిపించడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది మే 17న కూడా అభిషేకం తర్వాత శివలింగంపై ఓ నాగుపాము పడగవిప్పి దర్శనమిచ్చింది. అలాగే, గతేడాది అక్టోబర్‌లో నాగుల చవితి రోజున రెండు నాగుపాములు శివలింగం పక్కన కనిపించి భక్తులను ఆశ్చర్యపరిచాయి. తరచూ ఇలా నాగసర్పాలు దర్శనమివ్వడం ఆ క్షేత్ర మహత్యంగా స్థానికులు చెబుతున్నారు

రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

-రూ.1.03 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్ట్ నిర్మాణం

-ఏటా 9 మిలియన్ టన్నుల పెట్రో ఉత్పత్తుల తయారీ లక్ష్యం

-నిర్మాణ, నిర్వహణ దశల్లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు

-ప్రాజెక్టులో గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు ఏర్పాటు

రామాయపట్నం,నెల్లూరు, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక అడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.



రూ.1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో...
సుమారు రూ.1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మిస్తారు. ఇందులో 5.4 మిలియన్ టన్నుల పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వంటి రవాణా ఇంధనాలతో పాటు, 3.2 మిలియన్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయాలన్నది లక్ష్యం.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట
పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్టులో పెద్దపీట వేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు ప్రాంగణంలో 30 శాతం, అంటే సుమారు 1,563 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని (గ్రీన్ బెల్ట్) అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కోసం ప్రత్యేకంగా రూ.3,022 కోట్లు కేటాయించడం గమనార్హం. వీటితో పాటు గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు, రామాయపట్నం పోర్టుతో అనుసంధానించిన మెరైన్ క్రూడ్ ఆయిల్ టెర్మినల్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం కానున్నాయి.

మారనున్న ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు
ఈ రిఫైనరీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారనున్నాయని, దక్షిణ భారతదేశంలోనే ఇది ఒక ప్రధాన ఇంధన, పెట్రోకెమికల్ హబ్‌గా ఎదుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో వేలాది మందికి, ఆ తర్వాత నిర్వహణ దశలోనూ వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అనుమతుల ప్రక్రియ ఖరారైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు బీపీసీఎల్ సన్నాహాలు చేస్తోంది

స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట
-రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మంగళగిరి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళగిరిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు..అభివృద్ధి.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

-ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం

-గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ

-పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి

-ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు,

-ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

ప్రొద్దుటూరు,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
“యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం” అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన ‘అమరజీవి జలధార’ పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.



3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు.

గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. “ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్’కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు” అని దుయ్యబట్టారు.

ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనుల వేగవంతం
2024లో ఈ పథకం ముగిసి పోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. “గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష” అని పవన్ పేర్కొన్నారు.

తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు
తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. “దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం” అని ఉద్ఘాటించారు.

నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారు
గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.

మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులు
రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. “రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం” అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ

-ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణం సాధించిన సురేఖ - అభినందించిన మంత్రి లోకేశ్
-2028 ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచన
-ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ
-ఏషియన్ గేమ్స్‌లో ఇప్పటివరకు 6 పతకాలు సాధించిన సురేఖ



ఉండవల్లి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సోమవారం ఉండవల్లి లోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు.

ఇప్పటివరకు ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు
ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

దర్శకుడిగా కిరణ్ అబ్బవరం తొలి సినిమా..
'ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కిరణ్.. ఇప్పుడు దర్శకుడిగా కూడా కొత్త బాధ్యతలు చేపట్టాడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న తొలి సినిమాకు తాజాగా 'రియాలిటీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసిన చిత్రబృందం.. సినిమాను క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 25న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కిరణ్ అబ్బవరం ఇప్పటివరకు హీరోగా పలు సినిమాలు చేస్తూ వచ్చాడు. అయితే 'రియాలిటీ'తో తొలిసారి మెగాఫోన్ పట్టుకుని దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టాడు. హీరోగా నటిస్తూనే సినిమాను డైరెక్ట్ చేయడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఈ సినిమాలో కిరణ్ ఒక చెఫ్ పాత్రలో కనిపించనున్నాడు. కథకు చెఫ్ నేపథ్యం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు విడుదలైన టైటిల్ గ్లింప్స్ ద్వారా సినిమా ప్రపంచం, కిరణ్ పాత్రపై కొంత ఆసక్తిని పెంచారు. పూర్తి కథ, పాత్రల గురించి మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. 'రియాలిటీ'కి డిసెంబర్ 25 విడుదల తేదీని ప్రకటించడంతో.. క్రిస్మస్ సీజన్‌లో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'దాదా', అక్కినేని నాగార్జున నటిస్తున్న 'కింగ్ 100' సినిమాలు కూడా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.దీంతో డిసెంబర్ 25న మూడు సినిమాల మధ్య పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. ముగ్గురు హీరోల సినిమాలు ఒకే పండుగ సీజన్‌లో విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ పోటీ టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చగా మారే అవకాశం ఉంది. బాలకృష్ణ, నాగార్జున వంటి సీనియర్ స్టార్ హీరోల సినిమాలతో కిరణ్ అబ్బవరం సినిమా పోటీ పడుతుండటం 'రియాలిటీ'కి మరో ప్రత్యేకతగా మారింది. ముఖ్యంగా క్రిస్మస్ సెలవులను లక్ష్యంగా చేసుకుని మూడు సినిమాలు విడుదలవుతుండటంతో థియేటర్ల కేటాయింపు, ప్రేక్షకుల ఆదరణ, ఓపెనింగ్స్ విషయంలో పోటీ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. 'రియాలిటీ' టైటిల్ గ్లింప్స్ కూడా తాజాగా విడుదలైంది. ఇందులో సినిమా నేపథ్యంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచే అంశాలను చూపించారు. టైటిల్‌కు తగ్గట్టుగానే కథలో వాస్తవికతకు ప్రాధాన్యం ఉండబోతుందా? లేక విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతుందా? అనే ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దశలో ఉంది. రాబోయే రోజుల్లో కథానాయిక, ఇతర నటీనటులు, కథా నేపథ్యం, పాత్రల వివరాలతో పాటు ప్రమోషనల్ కంటెంట్‌ను చిత్రబృందం విడుదల చేసే అవకాశం ఉంది.

విశ్వక్‌సేన్ 'కల్ట్' విడుదల అప్పుడే



విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కల్ట్'. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు.భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా 'కల్ట్' విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: 'యానిమల్'ఫేం సచిన్.



నాకు ఎలాంటి బినామీ ఆస్తులు లేవు..
అబద్ధాలు ఆపండి ఇంక..



సినీ పరిశ్రమలో సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో వచ్చే రూమర్లు ఒక్కోసారి తీవ్ర దుమారం రేపుతుంటాయి. తాజాగా టాలీవుడ్, బాలీవుడ్‌లలో అనేక హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తనపై వస్తున్న తప్పుడు వార్తల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నివాసాలపై ఐటీ (ఇన్కమ్ టాక్స్) సోదాలు జరిగాయని, అలాగే భారీగా బినామీ ఆస్తులు ఉన్నాయంటూ కొన్ని మీడియా మాధ్యమాలలో ప్రసారమైన కథనాలపై ఆమె తీవ్రంగా స్పందించారు.ఆ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో సుధీర్ఘ పోస్ట్ చేశారు. ఎలాంటి ప్రాథమిక సమాచారం లేకుండా, కేవలం సంచలనం కోసం కొందరు నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. తన ప్రతిష్టను దిగజార్చేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారమవుతున్న ఈ ఫేక్ వార్తలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన జర్నలిజం పేరుతో కొందరు ఇలాంటి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇలాంటి తప్పుడు వదంతులను ఎవరూ నమ్మవద్దని రకుల్ ప్రీత్ సింగ్ తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఒక సెలబ్రిటీ వ్యక్తిగత జీవితంపై, ఆర్థిక లావాదేవీలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం చట్టరీత్యా కూడా నేరమని, భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు వార్తలు ప్రసారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.కనీస వాస్తవాలను పరిశీలించకుండా కేవలం సంచలనం కోసమే ఇలాంటి ఫేక్ రూమర్స్ వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. తాను సైనిక నేపథ్యం ఉన్న క్రమశిక్షణ ఉన్న కుటుంబం నుంచి పరిశ్రమలోకి అడుగుపెట్టానని.. చిత్రసీమలో తనకు ఎలాంటి గాడ్ ఫాదర్స్ అండదండలు లేవని అన్నారు. కేవలం తన సొంత శ్రమ, నిరంతర కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేసుకున్నారు. దేశ చట్టాలని గౌరవించే బాధ్యతాయుతమైన పౌరురాలిగా.. తన ఇరవైళ్ల ప్రాయం నుంచి ప్రభుత్వానికి ప్రతి రూపాయి పన్నును క్రమం తప్పకుండా చెల్లిస్తున్నానని అన్నారు.తనకు విదేశీ లావాదేవీలు, బినామీ ఆస్తుల ఆరోపణలు ఆమె తోసిపుచ్చారు. వ్యక్తిగత హోదాలో కానీ లేదా ఏ నిర్మాణ సంస్థ తరుపున కానీ ఎలాంటి అక్రమ విదేశీ నగదు మార్పిడులలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని అన్నారు. దేశంలో, విదేశాల్లో కానీ తనకు ఎవరి తరుపునా ఎలాంటి బినామీ ఆస్తులు లేవని అన్నారు. తన గురించి జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నారు.

మళ్లీ వాయిదా పడిన 'ఆదర్శ కుటుంబం'
అసలు కారణం ఇదే, కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా పడింది. కొంతకాలంగా ఈ సినిమా విడుదలపై సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా.. తాజాగా నిర్మాత నాగవంశీ అధికారికంగా స్పందించి వాయిదా విషయాన్ని వెల్లడించారు. దీంతో ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ఆసక్తి నెలకొంది. 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా వేయడానికి ప్రధాన కారణం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడమేనని నిర్మాత నాగవంశీ తెలిపారు. కొన్ని సాంకేతిక పనులు మరో నాలుగైదు రోజులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో అనుకున్న సమయానికి సినిమాను విడుదల చేయడం కంటే.. పూర్తి నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే మంచిదని చిత్రబృందం నిర్ణయించినట్లు చెప్పారు.సినిమా అవుట్‌పుట్‌పై టీమ్ పూర్తిగా సంతృప్తి చెందిన తర్వాతే దాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నామని నాగవంశీ వెల్లడించారు. సినిమా కాపీ చూసిన తర్వాత టీమ్ అంతా సంతృప్తిగా ఉందని భావించినప్పుడే విడుదల చేస్తామని, అందుకోసం కొంత సమయం తీసుకోవడం తప్పేమీ కాదని పేర్కొన్నారు. వెంకటేశ్--త్రివిక్రమ్ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉండటంతో 'ఆదర్శ కుటుంబం' విడుదల తేదీపై మొదటి నుంచీ ఆసక్తి నెలకొంది. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రకటించారు. అయితే ఆ తేదీ నుంచి అక్టోబర్ 9కి వాయిదా వేశారు. ఇప్పుడు మరోసారి విడుదల వాయిదా పడింది.కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాత నాగవంశీ తెలిపారు. దీంతో ఈ సినిమా అక్టోబర్‌లోనే వస్తుందా? లేక మరింత ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రమిది కావడంతో 'ఆదర్శ కుటుంబం'పై అభిమానుల్లో మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో వెంకటేశ్ చిట్టిబాబు అనే మధ్యతరగతి వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. ఆయన భార్యగా శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. నివేదా పేతురాజ్, నారా రోహిత్, రావు రమేశ్, రఘుబాబు, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు. నారా రోహిత్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465